సాక్షి
అనకాపల్లి
శనివారం । 6 । జూలై । 2024



న్యూస్‌రీల్

జగన్నాథుని రథోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



అనకాపల్లి: పట్టణంలో జగన్నాథస్వామి రథోత్సవాల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ఈవో రాజసులోచన శుక్రవారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి గవరపాలెం జగన్నాథస్వామి ఆలయంలో రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. స్థానిక గూడ్స్‌రోడ్డు ఇంద్ర ద్యుమ్నహాల్‌లో దేవదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో శ్రీ సుభద్ర బలభద్ర సమేత జగన్నాథస్వామి ఉత్సవాలను ఈనెల 7 నుంచి నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆ రోజు తొలి రథయాత్రను నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. గూడ్సు రోడ్డు వద్ద ఇంద్రద్యుమ్న హాల్లో స్వామివారికి దశావతారాల అలంకరణ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈనెల 7న మత్స్యావతారం, 8న కూర్మావతారం, 9న వరాహావతారం, 10న నారసింహ అవతారం, 11న వామనావతారం, 12న పరశురామావతారం, 13న రామావతారం, 14న కృష్ణావతారం, 15న బుద్ధావతారం, 16న కల్కి అవతారంలో స్వామి భక్తులకు దర్శనం ఇస్తారని ఆమె చెప్పారు. 16వ తేదీ సాయంత్రం 3 గంటలకు స్వామివారి తిరుగు రథయాత్ర నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పూర్తి ఏర్పాట్లు చేసినట్టు పేర్కొన్నారు.

ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులు



టీచర్ టూల్ శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్జేడీ విజయభాస్కర్

కశింకోట: విద్యార్థిలా నిరంతరం కొత్త అంశాలను నేర్చుకుని అందుకు అనుగుణంగా బోధన సాగించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని విశాఖ విద్యా శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు(ఆర్జేడీ) విజయ భాస్కర్ సూచించారు. స్థానిక డీపీఎన్ జిల్లా పరిషత్ హైస్కూలులో జిల్లాలోని సుమారు 120 మంది అభ్యర్థులకు ఐదు రోజులుగా నిర్వహిస్తున్న టీచర్ టూల్ శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికి సమున్నత గౌరవం కల్పించాలని చెప్పారు. కోర్సు డైరెక్టర్, స్కూలు హెచ్ఎం ఎం.ఆర్.వి అప్పారావు, ఎంఈవో–2 కె.ఎ స్.ఎన్. మూర్తి, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ శ్రీలక్ష్మి, జిల్లా కో–ఆర్డినేటర్ నీతిక, మాస్టర్ ట్రైనీలు నారాయణరావు, నూకేష్, అచ్యుత కృష్ణ, వేణుగోపాల్, శ్రీరామమూర్తి, ఫణీంద్ర కుమార్, ఉపాధ్యాయులు ఆనంద్, రవి, అప్పారావు పాల్గొన్నారు.

రేపు చదరంగం ఎంపిక పోటీలు

అనకాపల్లి: అండర్–19 బాలుర, బాలికల చదరంగం జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 7న స్థానిక సాయిశక్తి టెక్నో పాఠశాల ఆవరణలో ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్నట్టు జిల్లా చదరంగం సంఘం అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో తొలి నాలుగుస్థానాల్లో నిలిచిన క్రీడాకారులు 19న జరిగే రాష్ట్రస్థాయి అండర్ 19 పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. గతంలో apchess.org వెబ్‌సైట్‌లో నమోదు చేసుకున్న క్రీడాకారులు మాత్రమే ఈ పోటీల్లో నేందుకు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 9676636661, 7032562545 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

అనకాపల్లి: జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు–2024కు అర్హత కలిగిన ఉపాధ్యాయుల నుంచి ఈనెల 15వ తేదీవరకూ ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. nationalawardstoteachers.education.gov.in/ లో పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9866869248 ఫోన్ నంబరులో సంప్రదించాలని తెలిపారు.

రేపు హాకీ ఎంపిక పోటీలు

యలమంచిలి : అనంతపురంలో నిర్వహించే అంతర్ జిల్లాల మహిళల హాకీ పోటీలకు యలమంచిలి డిగ్రీ కళాశాల హాకీ మైదానంలో ఈ నెల 7న జిల్లా జట్ల ఎంపిక నిర్వహించనున్నట్టు జిల్లా హాకీ జనరల్ సెక్రటరీ కొఠారు నరేష్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఎంపికలకు 2008 తర్వాత జన్మించిన క్రీడాకారులు అర్హులని తెలిపారు. సంబంధిత అర్హత పత్రాలతో ఎంపికలకు హాజరుకావాలని ఆయన కోరారు.

రెండు సరకులతో సరి!

- జులై నెల కోటాలో బియ్యం, గోధుమ పిండి మాత్రమే పంపిణీ



సాక్షి, అనకాపల్లి: రేషన్ వినియోగదారుల ఆశలపై కొత్త ప్రభుత్వం నీళ్లు చల్లింది. గత ప్రభుత్వం అందజేసిన బియ్యం, గోధుమ పిండి, పంచదార, కందిపప్పు, వంటనూనెతో పాటు ఈ నెల రాగిపిండి అందజేస్తారని వినియోగదారులు భావించినా.. కూటమి ప్రభుత్వం ఉన్న సరకుల్లో కోత విధించింది. కేవలం బియ్యం, గోధుమ పిండి మాత్రమే పంపిణీ చేస్తోంది. రేషన్ కార్డుదారులకు రాగిపిండి సరఫరా చేస్తామని కూటమి ప్రభుత్వం హడావుడిగా ప్రకటించింది. కానీ జులై నెల అమలుకు నోచుకోలేదు. ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో 5,41,818 రేషన్ కార్డులు, 1069 చౌక ధరల డిపోలు ఉన్నాయి. 374 ఎండీయూ (డోర్ టు డోర్ పంపిణీ) వాహనాల ద్వారా సరకులు పంపిణీ చేస్తున్నారు. చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు, 24 మండలాల డిప్యూటీ తహసీల్దార్లు ఈ విభాగంలో పనిచేస్తున్నారు. అయితే జిల్లాలో రేషన్ కార్డుదారులకు నిత్యావసర సరకుల పంపిణీ అరకొరగానే ఉంది. కొత్త ప్రభుత్వంలో మరిన్ని సరకులు వస్తాయని ఆశగా ఎదురు చూసిన పేదలకు నిరాశే మిగిలింది. కందిపప్పు ఇంకా గోదాములు దాటి బయటకు రావడం లేదు. కందిపప్పు గురించి ఇప్పటి వరకు ఎలాంటి ఇండెంట్ రాలేదని డీలర్లు చెబుతున్నారు. అధికారులు సైతం జులై, ఆగస్టు రెండు నెలల సరకులు కలిపి వచ్చేనెల ఇస్తామంటున్నారే తప్ప .. ఇస్తామనే నమ్మకం అధికారులకే కలగడం లేదు. ప్రస్తుతం యూనిట్‌కు నాలుగు కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో కార్డుదారుడికి అర కిలో పంచదార ఇచ్చేవారు.

జూన్ నెలలో కార్డుదారునికి అర కిలో పంచదార రూ.17, గోధుములు ఒక కిలో రూ. 16 చొప్పున సరఫరా చేశారు. అయితే ప్రస్తుత ప్రభుత్వంలో జులై నెలలో పంచదార, గోధుమల పంపిణీ ఊసే లేదు. రాగి పిండి ఇస్తారేమోనని ఎదురు చూసిన కార్డుదారులకు నిరాశే మిగిలింది. జులై కోటాకు ఎలాంటి ఇండెంట్ లేదని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు ధర మండిపోతోంది. దీంతో పేదలు ఇబ్బంది పడుతున్నారు. కందిపప్పు కోసం ఎదురుచూసిన వారికి చుక్కెదురైంది. గోదాముల్లో 50 కిలోల బియ్యం బస్తాలో ఒక కిలో తక్కువగా ఉంటోందని డీలర్లు గగ్గోలు పెడుతున్నారు.

వచ్చే నెల ఇస్తాం..

జులై నెలలో బియ్యం, గోధుమ పిండి మాత్రమే పంపిణీ చేస్తున్నాం. మిగతా పంచదార, రాగి పిండి, కందిపప్పు వంటివి వచ్చే నెల రెండు నెలలకు కలిపి ఇస్తాం. ప్రస్తుతం జులై నెలకు సంబంధించి బియ్యం, గోధుమ పిండి పూర్తి స్థాయిలో పంపిణీ చేశాం. దీనికి సంబంధించి ప్రభుత్వం మార్గదర్శకాలు కూడా జారీచేసింది.

– కె.వి.ఎల్.ఎస్. మూర్తి, జిల్లా పౌరసరఫరాల అధికారి, అనకాపల్లి

జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి

- నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన విజయ కృష్ణన్



కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న విజయ కృష్ణన్

సాక్షి, అనకాపల్లి: జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తానని, రాష్ట్రంలోనే అభివృద్ధిలో అనకాపల్లి జిల్లా ముందుండేలా చర్యలు తీసుకుంటానని నూతన కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. జిల్లా కలెక్టర్‌గా శుక్రవారం ఉదయం 10 గంటలకు ఆమె బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ విజయ కృష్ణన్‌కు వేద పండితుల ఆశీర్వచనాల మధ్య జేసీ జాహ్నవి, డీఆర్‌వో శ్రీనివాసరావు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ.. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన విజయ కృష్ణన్‌కు జిల్లా అధికారులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు కలిసి పుష్ప గుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ మురళీకృష్ణ, అడిషనల్ ఎస్పీ విజయ భాస్కర్, ఆర్‌డీవోలు చిన్నికృష్ణ, హెచ్‌బీ జయరామ్, డిప్యూటీ కలెక్టర్ ఎస్.వి.ఎస్ సుబ్బలక్ష్మి, కలెక్టరేట్ ఏవో బి.రాజేశ్వరరావు, ఇతర విభాగాల సూపరింటెండెంట్లు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, వైద్యాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పోలీసు శాఖకు చెందిన అధికారులు, సిబ్బంది కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



కలెక్టర్ కె.విజయకృష్ణన్‌కు మొక్క అందజేస్తున్న ఎస్పీ కె.వి.మురళీకృష్ణ



స్వాగతం పలుకుతున్న జేసీ జాహ్నవి

మోటూరుపాలెంలో డయేరియా కలకలం



గ్రామంలో వివరాలు సేకరిస్తున్న అధికార బృందం



- రెండు రోజుల వ్యవధిలోనే 18 మందికి వ్యాప్తి
- ఫుడ్ పాయిజన్‌గా తొలుత అనుమానాలు
- కేజీహెచ్, ఎన్టీఆర్ ఆస్పత్రికి రోగుల తరలింపు
- చికిత్సలో 12 మంది, కోలుకున్న ఆరుగురు

అచ్యుతాపురం: వాంతులు, విరేచనాలతో అల్లాడిపోతున్న దిబ్బపాలెం శివారు గ్రామం మోటూరుపాలేనికి అధికారుల తాకిడి పెరిగింది. అచ్యుతాపురం మండలంలోని సెజ్ పునరావాస కాలనీలో భాగంగా ఏర్పాటు చేసిన శివారు కాలనీ మోటూరులో రెండు మూడు రోజులుగా పరిస్థితి అదుపు తప్పింది. డయేరియాగా భావిస్తున్న తరుణంలో ఫుడ్ పాయిజన్ కూడా జరిగిందనే అనుమానంతో వైద్యులు అప్రమత్తమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక వైపు డయేరియాను తరిమేద్దాం(స్టాప్ డయేరియా) స్లోగన్‌తో ప్రతిష్టాత్మక కార్యక్రమం నిర్వహిస్తున్న తరుణంలో డయేరియా విజృంభణపై అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ప్రస్తుతం గ్రామానికి చెందిన 18 మందికి డయేరియా సోకినట్లు వైద్య అధికారులు నిర్ధారించారు. వీరిలో ఐదుగురిని చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ముగ్గురిని అనకాపల్లి జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ ఆస్పత్రిలో చేర్చారు. నలుగురు అచ్యుతాపురం పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు.

మరో ఆరుగురు ఇప్పటికే కోలుకున్నట్లు పీహెచ్‌సీ సీహెచ్‌వో వేణుగోపాల్ వెల్లడించారు. మోటూరు గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్ తక్షణమే వైద్య సేవల్ని వేగవంతం చేయించాలని, గ్రామంలో పరిశుభ్ర వాతావరణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు వైద్య ఆరోగ్య సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకున్నారు. డీఎంహెచ్‌వో, డీపీవో, తహసీల్దార్, ఎంపీడీవో, పీహెచ్‌సీ సిబ్బంది గ్రామంలో పర్యటించి పరిస్థితులపై ఆరా తీస్తున్నారు. గ్రామంలో ఎక్కడికక్కడ బ్లీచింగ్ చల్లి స్థానికుల్ని అప్రమత్తం చేశారు.

జిల్లా ప్రగతిలో రవి పట్టన్‌శెట్టి మార్క్

- జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ మురళీకృష్ణ
- జిల్లాలో అందించిన సేవలు సంతృప్తినిచ్చాయి: రవి పట్టన్‌శెట్టి



మాట్లాడుతున్న రవి పట్టన్‌శెట్టి

సాక్షి, అనకాపల్లి: నూతన జిల్లాగా ఏర్పడిన అనకాపల్లికి తొలి కలెక్టర్‌గా రవి పట్టన్‌శెట్టి అందించిన సేవలు మరువలేనివని, జిల్లా ప్రగతిలో తనదైన మార్క్ లిఖించుకున్నారని నూతన కలెక్టర్ కె.విజయ కృష్ణన్ కొనియాడారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన రవి పట్టన్‌శెట్టి వీడ్కోలు సభలో ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడారు. ఐఏఎస్–2013 బ్యాచ్‌కు చెందిన తామిద్దరం కలిసి ట్రైనింగ్ పూర్తి చేసుకున్నామన్నారు. సోదర సమానుడైన రవి పట్టశెట్టి గ్రామీణ జిల్లా అనకాపల్లి అభివృద్ధిలో తన పాలనా నిర్ణయాలతో మెరుగైన ప్రదర్శన కనబరిచారని తెలిపారు. దాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు బాపట్ల జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన అనుభవం, జిల్లా అధికారుల సూచనలు, సలహాలతో కృషి చేస్తానన్నారు.

జిల్లా ఎస్పీ కె.మురళీకృష్ణ మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలో తనకు కలెక్టర్‌గా రవి పట్టన్‌శెట్టి అందించిన సలహాలు, సూచనల్ని కొనియాడారు. ఆయన మార్గనిర్దేశంలో జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, సజావుగా సార్వత్రిక ఎన్నికల నిర్వహణ పూర్తి చేయగలిగామన్నారు.

జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి మట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ల్యాండ్ రీ సర్వే, డాటెడ్ ల్యాండ్స్, 22ఎ తదితర భూ సమస్యల పరిష్కారానికి తనను వెన్నంటి నడిపించారని కొనియాడారు. పలువురు జిల్లా అధికారులు రవి పట్టన్‌శెట్టి సేవలను, వారితో కలసి నిర్వహించిన విధులను గుర్తు చేసుకున్నారు. అనంతరం రవి పట్టన్‌శెట్టి మాట్లాడుతూ ప్రభుత్వ విధి నిర్వహణలో బదిలీలు సర్వసాధారణమన్నారు. అనకాపల్లి జిల్లా కొత్తగా ఏర్పడిన సమయంలో కనీస వసతుల కల్పనకై తన శక్తి మేర కృషి చేసినట్టు పేర్కొన్నారు. జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు విధుల్లో తనకు సహకరించిన జిల్లా అధికారులందరకీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. అనకాపల్లి జిల్లాను తన జీవితంలో మరిచిపోలేనని, ఇక్కడ పని చేయడం ఎంతో సంతృప్తినిచ్చిందని ఒకింత భావోద్వేగానికి గురయ్యారు.





రవి పట్టన్‌శెట్టిని సన్మానిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ మురళీకృష్ణ, జేసీ జాహ్నవి

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగాలకు దరఖాస్తులు

ఏయూక్యాంపస్: అగ్నివీర్ వాయు స్కీంలో భాగంగా ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో చేరేందుకు అవివాహితులైన స్త్రీ, పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి(టెక్నికల్–అన్‌స్కిల్డ్) కె.శాంతి తెలిపారు. జూలై 8వ తేదీ ఉదయం 11 గంటల నుంచి 28వ తేదీ రాత్రి 11 గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. అర్హులైన అభ్యర్థులు www.agnipathvayu. cdac.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

‘కిడ్నీ ర్యాకెట్’పై బిగుస్తున్న ఉచ్చు

- కేసు విచారణ వేగవంతం
- డీసీపీ–1తో పాటు 8 మందితో స్పెషల్ టీం
- ఆదేశాలు జారీ చేసిన సీపీ శంఖబ్రత బాగ్చి

సీతమ్మధార(విశాఖ) : కిడ్నీ సమకూర్చుతానంటూ మోసం చేసిన కేసులో విశాఖ సీతమ్మధారలోని ఎస్ఆర్ఐ ఆస్పత్రిపై ఉచ్చు బిగుస్తోంది. ఈ కిడ్నీ రాకెట్‌పై నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి సీరియస్ అయ్యారు. నిందితులపై కఠిన చర్యలకు రంగం సిద్ధం చేస్తున్నారు. విచారణ వేగవంతం చేయాలని ఇప్పటికే ఆయన ఆదేశాలు జారీ చేశారు. కిడ్నీ రాకెట్ వ్యవహారం నిగ్గు తేల్చేందుకు 8 మందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. దీనికి డీసీపీ–1 బి.లక్ష్మీనారాయణ నాయకత్వం వహిస్తున్నారు. ద్వారకా ఏసీపీ ఎస్.రాంబాబు నేతృత్వంలో సీఐ ఎస్.రమేష్‌తో పాటు పెందుర్తి ఎస్ఐలు ఆశిరి తాత, జె.సురేష్, కానిస్టేబుళ్లు ఆర్.సంతోష్, ఎస్.వాసు, జె.శివ, బి.మహేష్ కేసు దర్యాప్తు చేయనున్నారు.

అసలేం జరిగింది?

బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో వివరాల మేరకు.. నగరంలోని పురుషోత్తపురం జి.బ్లాక్ 310, కంఫర్ట్ హోమ్స్‌లో మూలవెంకట సత్యనారాయణ గోపి, భార్య శారదా లక్ష్మి నివాసముంటున్నారు. లక్ష్మి కొంత కాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతోంది. వారానికి మూడుసార్లు డయాలసిస్ చేయించేవారు. 2022 సెప్టెంబర్‌లో జీవన్‌దాన్‌లో కిడ్నీ మార్పిడి ప్రక్రియ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈలోగా తన భార్య ఆరోగ్యం క్షీణించడంతో సీతమ్మధారలోని ఎస్ఆర్ఐ ఆస్పత్రిని గోపి సంప్రదించారు. వైద్యురాలు వాణికి తన భార్య పరిస్థితిని వివరించారు. కిడ్నీలు మార్చితే ప్రాణాపాయం ఉండదని, కిడ్నీల కోసం ఆస్పత్రి కో ఆర్డినేటర్ అనిల్‌ను సంప్రదించాలని సూచించారు. తన దగ్గర దాతలు అందుబాటులో ఉన్నారని, ప్రక్రియ మొత్తానికి రూ.27లక్షలు ఖర్చు అవుతుందని, ముందుగా రూ.10 లక్షలు ఇవ్వాలని అనిల్.. బాధిత కుటుంబానికి చెప్పారు. దీంతో ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకులో అనిల్ ఖాతాకు దఫదఫాలుగా రూ.10 లక్షలు చెల్లించాడు. రోజులు గడుస్తున్నా కిడ్నీలు ఏర్పాటు చేయకపోగా.. ఫోన్ చేస్తున్నా అనిల్ లిఫ్ట్ చేయడం లేదు. దీంతో బాధిత కుటుంబం మరింత డీలా పడింది. భార్య ఆరోగ్య పరిస్థితి దిగజారడంతో జీవన్‌దాన్ ద్వారా పినాకిల్ ఆస్పత్రిలో కిడ్నీ మార్పిడి ఉచితంగా నిర్వహించారు. ప్రాణాపాయం నుంచి లక్ష్మి గట్టెక్కడంతో అనిల్ వ్యవహారం తేల్చుకోవాలని గోపి ప్రయత్నించారు. ఎస్ఆర్ఐ నెఫ్రాలజిస్టు వాణిని నిలదీయగా.. కిడ్నీ వ్యవహారంలో తన ప్రమేయం ఏమీ లేదని చెప్పడంతో దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. ఎట్టకేలకు అనిల్ తారసపడడంతో నిలదీయగా.. మీరిచ్చిన రూ.10 లక్షలు ఆస్పత్రి పెద్దలకు ఇచ్చానని.. ఇకపై ఆస్పత్రికి వచ్చి ఆరా తీస్తే ఊరుకునేది లేదని బెదిరించాడు. దీంతో వైద్యురాలు వాణి, ఆస్పత్రి కో–ఆర్డినేటర్ అనిల్ తనను మోసం చేశారని బాధితుడు ద్వారకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ, ఎస్.రమేష్ ఆధ్వర్యంలో ఎస్ఐ ధర్మేంద్ర 420 కేసు నమోదు చేసి విచారణ వేగవంతం చేశారు.

నేడు పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్

అనకాపల్లి: జిల్లాలోని పశువుల ఆస్పత్రుల్లో శనివారం పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్టు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి.ప్రసాదరావు తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో పశువైద్య ఆస్పత్రులకు 16,660 డోసుల రేబిస్ నిరోధక టీకాలను సరఫరా చేసినట్టు చెప్పారు. పెంపుడు కుక్కలున్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. రేబిస్ వ్యాధి ఉన్న కుక్క కరవడం వల్ల ఆ వ్యాధి మనుషులకు, జంతువులకు సోకుతుందన్నారు. కుక్క కరిస్తే ఐదు డోసుల రేబిస్ టీకాను తప్పనిసరిగా మనుషులు వేసుకోవాలన్నారు.

విశాఖలో ‘బుజ్జి’ సందడి



విశాఖ వేలీ స్కూల్‌లో ‘కల్కి’ వాహనం బుజ్జి

ఆరిలోవ(విశాఖ) : పాన్ ఇండియా హీరో ప్రభాస్ నటించిన ‘కల్కి 2898 AD’ సినిమా ప్రేక్షకులను విశేషంగా అలరిస్తోంది. ఈ సందర్భంగా ‘కల్కి’లో ప్రభాస్ వాడిన వెహికల్ ‘బుజ్జి’ని విశాఖలోని విశాఖ వేలీ స్కూల్ ప్రదర్శనకు ఉంచారు. శుక్రవారం బుజ్జిని చూసేందుకు విద్యార్థులుపోటీ పడ్డారు. బుజ్జి వాహనాన్ని వైజయంతి మూవీస్ నిర్వాహకులు గురువారం విశాఖ వేలీ స్కూల్‌కు తీసుకొచ్చి ప్రదర్శనకు పెట్టారు. దీనిపై పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ వాహనాన్ని ఏవిధంగా తయారు చేశారో మెకానికల్ ఇంజినీర్లు ప్రతిభను వివరించారు. దీనిలో ఎలాంటి భాగాలు వాడారు, ఏవిధంగా నడుస్తుంది తెలియజేశారు. బ్యాటరీతో నడిచే ఈ వాహనం తయారీకి రూ.7 కోట్లు ఖర్చు చేసినట్టు సినిమా ప్రొడక్షన్ విభాగం ప్రతినిధి రమేష్ తెలిపారు. విద్యార్థులకు దీనిపై అవగాహన కల్పించడానికి, మన ఇంజినీర్ల ప్రతిభ తెలియజెప్పడానికి ఇక్కడ ప్రదర్శించినట్లు తెలిపారు. స్కూల్ క్రీడా మైదానంలో ఈ వాహనాన్ని నడిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్ సూచనలతో ఈ వాహనం చూడడానికి విద్యార్థులను తరగతుల వారీగా ఉపాధ్యాయులు తీసుకెళ్లారు. వాహనం గురించి వివరించారు. అక్కడ విద్యార్థులకు ఫొటోలు తీశారు. విషయం తెలుసుకొన్న పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పాఠశాలకు చేరుకొని ఆ వాహనం వద్ద ఫొటోలు దిగారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్ వైజయంతి మూవీస్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవు

- నర్సీపట్నం ఆర్టీసీ డీఎం ధీరజ్



డీఎం సమక్షంలో దుకాణాన్ని తొలగిస్తున్న సిబ్బంది

మాకవరపాలెం: ఆర్టీసీ స్థలాలను ఆక్రమిస్తే కేసులు తప్పవని నర్సీపట్నం ఆర్టీసీ డీఎం ధీరజ్ స్పష్టం చేశారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు స్థలంలో ఏర్పాటు చేసిన దుకాణాన్ని శుక్రవారం ఆయన దగ్గరుండి సిబ్బందితో తొలగించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ ఆర్టీసీకి సంబంధించిన స్థలాలను ఎవరైనా ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినా, దుకాణాలు ఏర్పాటు చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణాలు పెట్టుకునేవారు తాము నిర్వహించే వేలం పాటలో పాల్గొని నిబంధనల ప్రకారం అద్దెకు స్థలాన్ని లీజుకు తీసుకోవాలన్నారు.

కొత్త చట్టాలను ఆమోదించిన తీరు సరైంది కాదు

- కేంద్ర సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్

సింహాచలం : కొత్తగా నేర చట్టాలను పార్లమెంట్‌లో ఆమోదించిన తీరు సరైంది కాదని, తీవ్ర విమర్శలకు గురైందని కేంద్ర సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్ పేర్కొన్నారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శుక్రవారం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ), కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ (సీఆర్‌పీసీ) ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ (ఐఏ) స్థానంలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియం(బీఎస్ఏ) అమల్లోకి వచ్చాయన్నారు. అయితే ఈ నేర చట్టాలను పార్లమెంట్‌లో ఆమోదించిన తీరు తీవ్ర విమర్శలకు గురైందని గుర్తు చేశారు. గత ఏడాది డిసెంబర్‌లో ఆ చట్టాల తాలూకు బిల్లుల ఆమోదం సందర్భంగా లోక్‌సభ, రాజ్యసభ నుంచి ఏకంగా 146మంది విపక్ష ఎంపీలను సస్పెండ్ చేశారని, పార్లమెంట్ సభ్యులు చర్చ జరపకుండానే ప్రభుత్వం బిల్లులను ఏకపక్షంగా ఆమోదించిందని పిటీషనర్లు పేర్కొన్నారన్నారు. ప్రజల నుంచి కూడా ఈ కొత్త చట్టాలపై అభిప్రాయాలు సేకరించలేదన్నారు. జూలై 1 నుంచి జరిగే నేరాలను కొత్త చట్టాల ప్రకారం విచారించాల్సి ఉంటుందని, ఇది తీవ్ర గందరగోళానికి దారి తీసే ప్రమాదం ఉందన్నారు. న్యాయవాదులు, న్యాయమూర్తులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. అలాగే కేసుల నమోదు విషయంలో పోలీసులకు కూడా ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితులు కూడా ఉన్నాయన్నారు. నిందితులను వీడియో కాల్, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ జరపవచ్చని కొత్త చట్టాలు చెబుతున్నాయని, కానీ దేశంలో 80శాతం కోర్టుల్లో దీనికి అవసరమైన మౌలిక సదుపాయాలు లేవన్నారు. పాత, కొత్త చట్టాలకు సంబంధించిన కేసులు వాదించినపుడు ఎదురయ్యే ప్రాక్టికల్ సమస్యలు పరిష్కరించకుండా, చర్చలకు అవకాశం లేకుండా, కోర్టులలో మౌలిక సదుపాయాలు లేకుండా కొత్త చట్టాలు అమలు చేయడం సమంజసం కాదని తెలిపారు.

క్లుప్తంగా

కల్యాణం.. కమనీయం



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయ దాతలకు స్వామివారి శేషవస్త్రాలు అర్చకులు అందజేశారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 7 వినతులు

అనకాపల్లి: స్థానిక ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఏడుగురు సిబ్బంది హాజరై ఎస్పీ కేవీ మురళీకృష్ణకు తమ సమస్యలు నివేదించారు. అనారోగ్య, ఉద్యోగ, వక్తిగత సమస్యలపై అర్జీలు అందినట్లు ఎస్పీ వెల్లడించారు. సిబ్బంది సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్ పాల్గొన్నారు.

ఉద్యోగినిపై అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు

మునగపాక : విధి నిర్వహణలో తనను తప్పుడు పదజాలంతో దూషించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మునగపాక సచివాలయం -2 వీఆర్వో బిందు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. మునగపాకకు చెందిన ప్రశాంత్ రెవెన్యూ కార్యాలయంలోకి వచ్చి తనది కాని వన్-బీ ఫైల్ కోసం అడుగుతూ తక్షణమే పని పూర్తి చేయాలని లేకుంటే ఇబ్బంది పడతావంటూ బెదిరించినట్టు బిందు ఫిర్యాదులో పేర్కొన్నారు. దరఖాస్తు దారుడు వచ్చి సదరు ఫైల్‌కు సంబంధించి రిపోర్టు చేస్తే విచారణ చేపడతానని, నీకు ఈ ఫైల్‌తో సంబంధం లేదని చెప్పడంతో ప్రశాంత్ తనతో అసభ్యకరంగా వాదిస్తూ విధులకు ఆటంకం కలిగించారని, అలాగే మహిళా ఉద్యోగిని అని చూడకుండా ఇష్టారీతిలో ప్రవర్తించిన ప్రశాంత్‌పై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరుతూ ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు.

పేదల చదువు, ఆరోగ్యానికి 'బంగారి' బాట

- సామాజిక సేవా కార్యక్రమాల్లో మేటి
- సబ్ రిజిస్ట్రార్‌గా విధి నిర్వహణ
- 35 ఏళ్లుగా విద్యార్థులకు ఉచితంగా క్రీడలు, వ్యాయామ శిక్షణ
- స్నేహితులతో కలిసి నేస్తం ఫౌండేషన్ ద్వారా పుస్తకాల వితరణ
- ఆదర్శంగా నిలుస్తున్న బంగారి వెంకటేశ్వరరావు



నేస్తం ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు వ్యాయామ శిక్షణ ఇస్తున్న బంగారి వెంకటేశ్వరరావు



విద్యార్థులకు ట్యూటర్‌తో విద్యాబోధన

కె.కోటపాడు : కె.కోటపాడు సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న బంగారి వెంకటేశ్వరరావు సామాజిక సేవా కార్యక్రమాల్లోను ముందుంటూ అందరి మన్ననలను పొందుతున్నారు. సామాజిక బాధ్యతతో విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు గల శిక్షణతో పాటు, తోటి స్నేహితులతో కలిసి నేస్తం పౌండేషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రతీ ఏటా ఉచితంగా నోట్ పుస్తకాలను అందిస్తున్నారు. సొంత నిధులతో స్వగ్రామం తుమ్మపాలలో తన ఇంటి ఆవరణలో గల రాజగృహ విద్యా నిలయం పేరిట ట్యూటర్‌లను ఏర్పాటు చేసి విద్యార్థులకు ప్రవేట్ తరగతులను అందిస్తున్నారు. ఉద్యోగార్థులకు కాంపిటేటివ్ మెటీరియల్‌ను అందుబాటులో ఉంచుతూ ఉద్యోగ లక్ష్య సాధనలో వారికి తోడ్పాటును అందిస్తున్నారు.

తండ్రి సింహాచలం స్ఫూర్తితో...

బంగారి వెంకటేశ్వరరావు తండ్రి సింహాచలం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయునిగా విధులు నిర్వహించేవారు. తండ్రి సింహాచలం అనకాపల్లి నియోజకవర్గం తుమ్మపాల, నర్సింగరావుపేట, తాళ్ల పాలెం, పాయకరావుపేట నియోజకవర్గం చినదొడ్డిగల్లు తదితర గ్రామాల్లో నిర్వహించిన సామాజిక సేవా కార్యక్రమాలను చిన్న వయస్సులో వెంకటేశ్వరరావు గమనించేవారు. అప్పటి నుండి తండ్రి సేవా భావాన్ని స్ఫూర్తిగా తీసుకొని సామాజిక సేవకు నడుం బిగించారు. చదువులతో పాటు క్రీడల్లోను చురుకుగా ఉండే వెంకటేశ్వరరావు కబడ్డీ, బాక్సింగ్, రన్నింగ్ పోటీల్లో ముందుండేవారు. ఆసక్తి గల యువకులకు క్రీడల్లో ఉచితంగా శిక్షణను అందించేవారు. 1989లో వెంకటేశ్వరరావు సబ్ రిజిస్ట్రార్‌గా ఉద్యోగాన్ని పొందారు. ఉద్యోగం చేస్తూ తనకు ఆసక్తి గల క్రీడలపై ఉచితంగా విద్యార్థులకు కబడ్డీ, బాక్సింగ్, రన్నింగ్, వ్యాయామంపై 35 ఏళ్లుగా తుమ్మపాల కేంద్రంగా శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులకు వ్యాయామంతో మంచి ఆరోగ్యంతో పాటు మానసికోల్లాసం, ఏకాగ్రత మెరుగుపడే పరిస్థితులు ఉండడం వల్ల విద్యార్థులకు మేలు జరిగే పరిస్థితి ఉండడం వల్ల ప్రతి రోజూ శిక్షణ ఇవ్వడం జరుగుతుందని వెంకటేశ్వరరావు తెలుపుతున్నారు.

సేవా కార్యక్రమాలు :

బంగారి వెంకటేశ్వరరావు తన సొంత నిధులతో తుమ్మపాలలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేశారు. అదే విధంగా మూడేళ్ల పాటు అంబేద్కర్ జయంతి అయిన ఏప్రిల్ 14న రక్తదాన శిబిరాన్ని కూడా నిర్వహించనున్నారు. రక్తదానంతో ప్రాణపాయ పరిస్థితుల్లో ఉన్న వారికి ప్రాణదానం చేయవచ్చనే లక్ష్యంతో ప్రతి ఏటా రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నట్టు ఆయన తెలుపుతున్నారు.

స్నేహితులతో కలిసి నేస్తం ఫౌండేషన్

బంగారి వెంకటేశ్వరరావు తన స్నేహితులతో కలిసి 2008లో నేస్తం ఫౌండేషన్‌ను ప్రారంభించారు. ఈ ఫౌండేషన్ ద్వారా ప్రతి ఏటా జిల్లాలో ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో గల విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందిస్తున్నారు.

చోడవరం, బుచ్చయ్యపేట, నర్సింగబిల్లి, యడలమంచిలి, కె.కోటపాడు, రాంబిల్లి పాఠశాలల్లో నేస్తం ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. 6 నుండి 10 తరగతులకు చెందిన తెనుగుబూడి గురుకుల పాఠశాల విద్యార్థులకు 2014లో స్టడీ మెటీరియల్‌ను వెంకటేశ్వరరావు అందించారు.

కబడ్డీ అన్నగా గుర్తింపు

స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే కబడ్డీ పోటీల్లో వెంకటేశ్వరరావు నాయకత్వం వహించే జట్టుకు విజయాలు వరిస్తాయి. రాష్ట్ర స్థాయిలో జరిగే కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టుకు వెంకటేశ్వరరావు నాయకత్వం వహించేవారు. ఈయన నాయకత్వంలో పలుమార్లు జిల్లా జట్టు గెలుపొందినట్టు ఆయన తెలిపారు. దీంతో డిపార్ట్‌మెంట్‌లో పలువురు వెంకటేశ్వరరావును కబడ్డీ అన్నగా పిలుస్తుంటారు.



బాక్సింగ్‌లో యువతకు తర్ఫీదు ఇస్తున్న బంగారి



యువకులకు పరుగులో శిక్షణ

సంపాదనలో కొంత సమాజానికి...



అంబేడ్కర్ చెప్పిన విధంగా మనం సంపాదించిన దానిలో కొంతమేర సమాజానికి తిరిగి ఇవ్వాలన్న మాటలను నేను నమ్ముతాను. ఉద్యోగ రీత్యా సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్నా సామాజిక భాధ్యతతో సేవా కార్యక్రమాలను చేసేందుకు ముందుంటాను. నేను కూడా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకున్నాను. మంచి చదువులతో పాటు మంచి ఆరోగ్యం ఉంటే ఎంతటి లక్ష్యాలనైనా అందుకోవచ్చు. అందుకే పేద విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ, ట్యూషన్, వ్యాయామం, బాక్సింగ్, కబడ్డీలపై ఉచితంగా శిక్షణను అందిస్తున్నాను.

–బంగారి వెంకటేశ్వరరావు,
సబ్ రిజిస్ట్రార్, కె.కోటపాడు

నూకాంబికను దర్శించుకున్న నూతన కలెక్టర్



నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న నూతన కలెక్టర్ కె.విజయకృష్ణన్

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక అమ్మవారిని నూతన కలెక్టర్ కె.విజయకృష్ణన్ శుక్రవారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయ ఈవో బండారు ప్రసాద్, సిబ్బంది పూర్ణకుంభంతో ఆమెకు స్వాగతం పలికి, అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం దుశ్శాలువాతో ఆమెను ఈవో సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. నూతన ఆలయ నిర్మాణపనులను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎ.జె.చిన్నికృష్ణ, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ కె.వి.మురళీకృష్ణ

నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కె.విజయకృష్ణన్‌ను కలెక్టర్ కార్యాలయంలో ఎస్పీ కె.వి.మురళీకృష్ణ, అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

యలమంచిలి రూరల్ : పట్టణానికి సమీపంలో టిడ్కో గృహ సముదాయంలో నివసిస్తున్న కోడూరు శివ (28) అదృశ్యమైనట్టు కేసు నమోదు చేశామని యలమంచిలి పట్టణ పోలీసులు తెలిపారు. శివకు అతని భార్యకు మధ్య కుటుంబ కలహాలున్నాయి. భార్య ఇటీవల చీడికాడ పోలీస్‌స్టేషన్‌లో శివపై ఫిర్యాదు చేసింది. కేసు విచారణలో భాగంగా శివను చీడికాడ పోలీసులు పీఎస్‌కు రావాలని పిలిచారు. ఈ నేపథ్యంలో రెండ్రోజుల క్రితం నుంచి శివ కనిపించ లేదని అతని తండ్రి పట్టణ పీఎస్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ కోసం వెతుకుతున్నట్టు పోలీసులు తెలిపారు.

ఉపాధి కూలీల బకాయిలు చెల్లించాలని వినతి

అనకాపల్లి: జిల్లాలో ఎండలను సైతం లెక్క చేయకుండా ఉపాధి కూలీలు పనులు చేస్తున్నారని, వారం రోజులుగా వారికి రావాల్సిన వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం కలెక్టర్ కె.విజయకృష్ణన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ రెక్కల కష్టం మీద ఆధార పడిన వ్యవసాయ కూలీలకు ఉపాధి చట్టం ఒక వరంలా మారిందన్నారు. ఈ చట్టం ద్వారా లక్షల మంది ఉపాధి కూలీలు వ్యవసాయ పనుల్లేని సమయంలో ఉపాధి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో ఉపాధి కూలీల పని ప్రదేశాల్లో మజ్జిగ, మంచి నీరు, టెంట్లు తదితర సదుపాయాలు కల్పించేవారని, ఈ ఏడాది ఎక్కడా వాటిని ఇవ్వలేదన్నారు. వేసవి అలవెన్సులు ఎత్తేశారని ఆరోపించారు.

అచ్యుతాపురంతోపాటు జిల్లాలోని 24 మండలాల్లో కూలీలకు వేతనాలు చెల్లించలేదన్నారు. 100 రోజుల పని దినాలు కల్పించాల్సి ఉన్నా, రాజకీయ కారణాలతో ఆ పనుల్ని ఆపేశారని తెలిపారు. కోవిడ్ కాలం నుంచి సోషల్ ఆడిట్ జరగకపోవడంతో క్షేత్ర స్థాయిలో అవకతవకలపై అనుమానాలున్నట్లు తన వినతి పత్రంలో పేర్కొన్నారు. ఆయన వెంట సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.




క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

వరాహనదిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



యలమంచిలి: మండలంలోని ఏటికొప్పాక వద్ద వరాహ నదిలో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్టు యలమంచిలి రూరల్ ఎస్ఐ పి.సింహాచలం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం... నదిలో సుమారు 55 సంవత్సరాల వయస్సు కలిగిన పురుషుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. తెల్లచొక్కా, తెల్ల పంచె కట్టుకున్న పురుషుడి మృతదేహం సుమారు నాలుగు రోజుల కిందట నదీ ప్రవాహంలో కొట్టుకువచ్చింది. మృతదేహంపై ఎటువంటి గాయాలు లేవని, మృతుడు ధరించిన చొక్కాపై నర్సీపట్నానికి చెందిన శ్రీకన్య టైలర్స్ అని రాసిఉన్న స్టిక్కర్ ఉందని ఎస్ఐ తెలిపారు. మృతదేహం వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని చెప్పారు. పరిసర ప్రాంతాల్లో ఎవరైన తమ బంధువులు ఇప్పటికే అదృశ్యమైతే యలమంచిలి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. మృతదేహాన్ని అనకాపల్లి ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్టు ఎస్ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



నానాజీ (ఫైల్)

కశింకోట: మండలంలోని బయ్యవరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ రవిబాబు తెలిపిన వివరాలు... అనకాపల్లి నుంచి నర్సీపట్నం వైపు వెళుతున్న బైక్ బయ్యవరం సమీపంలోని డాబా వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. దీంతో బైక్ నడుపుతున్న గొలుగొండ మండలం జోగంపేటకు చెందిన బట్ట నానాజీ(29) రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడకు చేరే సరికి మృతి చెందాడు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. అనకాపల్లికి సొంత పని మీద వచ్చి, తిరిగి వెళుతుండగా ప్రమాదం జరిగిందని చెప్పారు. నానాజీ నర్సీపట్నంలోని ఓ ఫైనాన్స్ సంస్థలో పని చేస్తున్నాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.

గుర్తు తెలియని మృతదేహం వివరాలు లభ్యం

నాతవరం : ఏలేరు కాల్వలో తేలిన గుర్తు తెలియని మృతదేహం వివరాలు లభ్యమైనట్టు నాతవరం పోలీసుస్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ నాగరాజు తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మృతుడు మండలంలో పెదగొలుగొండ పేట గ్రామానికి చెందిన కొరుబిల్లి రమేష్ (37)గా గుర్తించినట్టు తెలిపారు. మద్యానికి బానిసైన అతను నిత్యం మద్యం మత్తులో ఉండేవాడన్నారు. గ్రామ సమీపంలో ఉన్న ఏలేరు కాలువ గట్టుపై గురువారం బహిర్భూమికి వెళ్లి మద్యం మత్తులో జారి కాలువలో పడిపోయాడన్నారు. ఆ సమయంలో ఎవరూ అతనిని గమనించకపోవడంతో నీటి ప్రవాహంలో కొట్టుకుని పోయి గురువారం సాయంత్రం ఎ.శరభవరం వద్ద ఏలేరు కాలువలో శవమై తేలాడన్నారు. ఎంటీపట్నం వీఆర్వో అప్పారావు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి శుక్రవారం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించామన్నారు. మృతుడు రమేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని హెచ్‌సీ నాగరాజు తెలిపారు.

మద్యం మత్తులో కాల్వలో పడి వ్యక్తి మృతి



కాల్వలో మృతి చెందిన జనపరెడ్డి లక్ష్మణరావు

యలమంచిలి రూరల్ : మద్యం మత్తులో ప్రమాదవశాత్తూ మురుగుకాల్వలో పడి పట్టణంలోని నాగేంద్ర కాలనీకి చెందిన జనపరెడ్డి లక్ష్మణరావు (40) మృతి చెందాడు. గురువారం రాత్రి ఇంటికి వస్తుండగా లక్ష్మణరావు నాగేంద్ర కాలనీకి సమీపంలో మురుగుకాల్వలో పడిపోయాడు. ఎవరూ చూడకపోవడంతో ప్రాణాలు కోల్పోయాడు. శుక్రవారం ఉదయం స్థానికులు కాల్వలో మృతదేహాన్ని గుర్తించి పట్టణ పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసి, శవ పంచనామా, పోస్టుమార్టం పూర్తి చేయించి కుటుంబీకులకు మృతదేహాన్ని అప్పగించారు. ఈ ఘటనతో మృతుని కుటుంబంలో విషాదం అలముకుంది. లక్ష్మణరావు మృతదేహం వద్ద కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

తహసీల్దార్, ఆర్ఐలపై కోర్టు ఆగ్రహం

యలమంచిలి రూరల్ : ఒక కేసులో కోర్టు వాయిదాలకు గైర్హాజరైన యలమంచిలి పూర్వపు తహసీల్దార్ రాణీ అమ్మాజీ, ఆర్ఐ విజయ్ భాస్కర్‌లపై యలమంచిలి ఏజేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. 2015లో తనకు తెలిలలియకుండా, తన పేరును తొలగించి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ అక్రమంగా జారీ చేశారని యలమంచిలికి చెందిన కొయ్య మంగ సరస్వతి కోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా కోర్టుకు తహసీల్దార్, ఆర్ఐలు గైర్హాజరయ్యారు. దీంతో న్యాయమూర్తి గతంలో వీరిద్దరికీ నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ రాణీ అమ్మాజీ, ఆర్ఐ విజయ్ భాస్కర్‌లు కోర్టుకు హాజరయ్యారు. బాధ్యతాయుతమైన ప్రభుత్వ అధికారులైన మీరు ఇలా కోర్టుకు గైర్హాజరు కావడమేమిటని న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేసినట్టు బాధితురాలి తరపు న్యాయవాది ఎస్‌వీపీ ప్రసాద్ శుక్రవారం రాత్రి సాక్షికి తెలిపారు. మరోసారి కోర్టు వాయిదాకు హాజరుకాకపోతే జ్యుడీషియల్ కస్టడీకి పంపిస్తానని న్యాయమూర్తి హెచ్చరించినట్టు ఆయన తెలిపారు. ప్రస్తుతం ఈ కేసు ట్రయల్ దశకు చేరుకుందని, వచ్చే నెల 5కు వాయిదా వేశారని న్యాయవాది ప్రసాద్ తెలిపారు. గతంలో కోర్టు వాయిదాకు హాజరు కాకపోవడంతో రీకాల్ పిటిషన్‌ను న్యాయమూర్తి అనుమతించే వరకు శుక్రవారం ఉదయం కోర్టు ప్రారంభమైన సమయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తహసీల్దార్, ఆర్ఐలు కోర్టు ఆవరణలోనే వేచి ఉండాల్సి వచ్చింది.

'అతిసార'పై అప్రమత్తం

- విశాఖ జిల్లాలో ప్రబలకుండా ముందస్తు చర్యలు
- రెండు నెలల పాటు ప్రత్యేక డ్రైవ్

మహారాణిపేట (విశాఖ): బాల్యం అతిసార బారిన పడి మృత్యువు అంచులకు చేరువవుతోంది. ముందస్తు జాగ్రత్తలతో అతిసార వ్యాధి నుంచి బయటపడే అవకాశం ఉంది. కాదని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రాణాంతకం కానుంది. జిల్లాల స్థాయిలోనూ ఈ ప్రమాదం పొంచి ఉందని జాతీయ ఆరోగ్య నివేదికలు రాష్ట్రాలను అప్రమత్తం చేశాయి. అతిసార వ్యాధి పట్ల జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. బాలల్లో అతిసార మరణాలను పూర్తిగా నివారించేందుకు స్టాప్ డయేరియా కార్యక్రమం ప్రారంభించింది.

గత రెండేళ్లలో సింగిల్ డిజిట్.. : జిల్లాలో గత రెండేళ్లలో అతిసార కేసులు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాయి. గత రెండేళ్లలో ఫ్యామిలి డాక్టర్, ఆరోగ్య సురక్ష లాంటి కార్యక్రమాల పేరిట నేరుగా గ్రామాల్లోనే హెల్త్ డ్రైవ్‌లు నిర్వహించడం, పాఠశాలల్లో ముందస్తుగా విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రాల్లో హెల్త్ చెకప్‌లు నిర్వహించడంతో అతిసార వ్యాధిని పూర్తిస్థాయిలో నియంత్రించగలిగారు.

మూడు దశల్లో ప్రత్యేక డ్రైవ్ : స్టాప్ డయేరియా ప్రచార కార్యక్రమం మూడు దశల్లో ఈ నెల 1 నుంచి వచ్చే నెల 31వ తేదీ వరకూ రెండు నెలల పాటు కొనసాగనుంది. ఈ నెల 1- 14వ తేదీ వరకూ తొలి దశ, 15 నుంచి వచ్చే నెల 16 వరకూ రెండో దశ, ఆగస్టు 17- 31వ తేదీ వరకూ మూడో దశగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆరోగ్య శాఖ ప్రచార బాధ్యతలు, అవగాహన కార్యక్రమాలు, ఇంటింటి ప్రచారాలు చేపడుతుంది. ఐదేళ్లలోపు చిన్నారులందరికీ ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఓఆర్ఎస్ ద్రావణం, జింక్ మాత్రలు పంపిణీ చేస్తారు.

కంటికి రెప్పలా.. : జిల్లాలో ఐదేళ్లలోపు చిన్నారులు 2,08,163 మంది ఉన్నారు. రెండు నెలల లోపు వయసున్న పిల్లల్లో అతిసార నివారణకు ఎటువంటి ద్రావణాలూ ఇవ్వరు. వారు తల్లి పాల మీద ఆధారపడి ఉండడమే దీనికి కారణం. తల్లిపాలు తాగే బిడ్డకు ఏమీ కాదన్నది శాస్త్రీయ నిరూపణ. రెండు నుంచి ఆరు నెలల మధ్య వయసున్న వారికి ఓఆర్ఎస్, జింక్ మాత్రలు 14 రోజుల పాటు ఇస్తారు. ఆరు నెలల నుంచి ఐదేళ్ల లోపు పిల్లలకు ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఓఆర్ఎస్ పాటు 20 గ్రాముల జింక్ మాత్రలను 14 రోజుల పాటు ఇస్తారు. అతిసార బారిన పడకుండా చంటి పిల్లల్ని కంటికి రెప్పలా కాచుకోవాలి.

గంజాయి కేసులో ముగ్గురికి జైలు

అనకాపల్లి: గంజాయి తరలిస్తూ వేర్వేరు కేసుల్లో పట్టుబడిన ముగ్గురికి జైలు శిక్షలు విధిస్తూ 10వ అదనపు జిల్లా జడ్జి కోర్టు న్యాయమూర్తి నందనవనం శ్రీవిద్య శుక్రవారం తీర్పు చెప్పారు. జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ శుక్రవారం వివరాలను వెల్లడించారు. మండలంలోని తుమ్మపాల వద్ద 2016 ఆగస్టు 24న 40 కిలోల గంజాయి కారులో తరలిస్తూ కశింకోటలోని పూసర్ల వీధికి చెందిన కొత్తం సూర్యప్రకాశరావు(40), చోడవరంలోని ఎడ్ల వీధిలో పిల్లవారి తోటకు చెందిన చొప్ప రమణమ్మ(49) పట్టుబడ్డారు. అనకాపల్లి ఎస్ఈబీ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, కోర్టుకు తరలించారు. వారిపై నేరం రుజువు కావడంతో పదేళ్ల కారాగార శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఏడాది అదనంగా శిక్ష అనుభవించాల్సి ఉంటుందన్నారు. తుమ్మపాలలోనే మరో కేసులో 2015 డిసెంబర్ 7న నాలుగు కిలోల గంజాయి తరలిస్తూ పట్టుబడిన పాడేరు మండలం గుత్తుల పుట్టు గ్రామానికి చెందిన పాంగి సరస్వతి(27)పై కూడా ఎస్ఈబీ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరచగా మేజిస్ట్రేట్ శిక్ష విధించినట్లు ఎస్పీ వెల్లడించారు. ఈ కేసులను అప్పటి ఎక్సైజ్ సీఐ వి.రవికుమార్ దర్యాప్తు చేసి అభియోగపత్రాలను కోర్టులో దాఖలు చేశారని పేర్కొన్నారు. రెండు కేసుల్లో శిక్షలు పడటానికి దోహదపడిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

క్లుప్తంగా

రేపు ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న యలక మల్లిబాబు

అనకాపల్లి: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆదివారం గ్రామ స్థాయి నుంచి పలు కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యలక మల్లిబాబు తెలిపారు. స్థానిక భీమునిగుమ్మంలోని కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగల ఆత్మగౌరవ కవాతు చేసే సమయంలో తెల్లచొక్కా, నల్లఫ్యాంట్, మెడ లో నల్లకండువా వేసుకుని రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి కొల్లి చిన్నఅప్పారావు, వర్కింగ్ అధ్యక్షుడు కటుమూరు మంగరాజు, ప్రధాన కార్యదర్శి కాకినాడ కనకేశరావు, జిల్లా నాయకులు నీటిపల్లి ముత్యాలరావు, గొట్టివాడ సామ్రాట్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ



రైతులకు వరి విత్తనాలు అందిస్తున్న నేతలు

కశింకోట: మండలంలోని ఉగ్గినపాలెం రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఉగ్గినపాలెంతోపాటు పరవాడపాలెం గ్రామాలకు చెందిన రైతులకు రాయితీపై విత్తనాలు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీకి చెందిన సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, పాల సంఘం అధ్యక్షుడు గాలి శ్రీనివాసరావు, తెలుగు రైతు జిల్లా నాయకుడు ఉగ్గిన రమణమూర్తి, టీడీపీ నాయకుడు కలగా సోమేశ్వరరావు, జనసేన నాయకుడు కలగా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు రైలు ప్రయాణాల్లో రాయితీ కల్పించాలి

అనకాపల్లి: పట్టణ పరిధిలో వృద్ధులు సమావేశాలు నిర్వహించుకునేందుకు నూతన భవనం కోసం ప్రజాప్రతినిధులు, కలెక్టర్‌ను కలిసి విన్నవించుకోనున్నట్లు జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు కాండ్రేగుల అప్పారావు తెలిపారు. స్థానిక గవరపాలెం వీవీ రమణ రైతు భారతి హాల్లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వృద్ధుల సమస్యల్ని గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. రైల్లో ప్రయాణించే సమయంలో చార్జీల్లో రాయితీలు కలిప్పించాలన్నారు. 60 ఏళ్లు దాటిన వృద్ధులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు అందజేయాలని ఆయన కోరారు. సమావేశంలో సంఘం సభ్యులు శరగడం నూకరాజు, విజయలక్ష్మి, విల్లూరి రాము, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 44 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ఠ ధర	గరిష్ఠ ధర
మొదటి రకం	5,350	5,350
రెండో రకం	5,000	5,000
మూడోరకం	3,650	3,780

అనకాపల్లి సినిమాలు

మహారాజ	:రాజా
కల్కి2898 ఏడీ	:సత్యనారాయణ స్క్రీన్-1
కల్కి2898 ఏడీ	:సత్యనారాయణ స్క్రీన్-2
కల్కి2898 ఏడీ	:షిర్డిసాయి
కల్కి2898 ఏడీ	:పర్లిసాయి
మనమే	:వెంకటేశ్వర
రాజధాని రౌడీ	:శ్రీసత్య
కల్కి2898 ఏడీ	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 59 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7 యూనిట్లు, బీ పాజిటివ్-22 యూనిట్లు, ఓ పాజిటివ్-28 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 418 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 379 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

అప్రమత్తతతోనే జూనోటిక్ వ్యాధుల నియంత్రణ

వైద్యులు, శాస్త్రవేత్తల అంచనా మేరకు జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధుల్లో 75 శాతం అంటువ్యాధులే. వీటిలో 60 శాతం జంతువుల నుంచి సంక్రమిస్తున్నవే. వీటినే జూనోటిక్ వ్యాధులంటారు. వీటి బారిన పడకుండా ముందు జాగ్రత్తలు పాటించాలని పశు సంవర్థక శాఖ అధికారులు, పశువుల వైద్యులు సూచిస్తున్నారు. నేడు(శనివారం) ప్రపంచ జూనోసిస్ దినోత్సవం. దీన్ని పురస్కరించుకుని మండలంలోని పలు స్కూళ్లు, పశు వైద్యశాలలు, రైతు భరోసా కేంద్రాల్లో శుక్రవారం జూనోటిక్ వ్యాధులపై అవగాహన కలిగించారు.



అచ్చెర్లలో జూనోటిక్ వ్యాధులపై అవగాహన కలిగిస్తున్న పశు వైద్య సహాయకుడు పి.ఈశ్వరరావు



కశింకోటలోని డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు జూనోటిక్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్న మండల పశు వైద్యాధికారి ఆల్ఫోన్స్ జార్జి

- జంతు ప్రేమికులు జాగ్రత్తలు పాటించాలి
- మనుషుల్లో 60 శాతం అంటు వ్యాధులకు కారణం ఇవే
- నేడు ప్రపంచ జూనోసిస్ దినోత్సవం
- కుక్కలకు ఉచిత రేబిస్ టీకాలు

కశింకోట: పశువులు, పెంపుడు జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులను జూనోటిక్ వ్యాధులుగా పేర్కొంటారు. లూయిస్ పాశ్చర్ అనే శాస్త్రవేత్త మొదటిసారిగా 1885 జులై 6న పిచ్చికుక్క కాటుకు గురైన బాలుడికి వ్యాధి రాకుండా వ్యాధి నిరోధక టీకా విజయవంతంగా వేశారు. ఏటా ఆ రోజును ప్రపంచ జూనోసిస్ దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.

జంతువుల ద్వారా వ్యాప్తి

కుక్కల ద్వారా రేబిస్, పందుల వల్ల మెదడువాపు, గొర్రెలు, మేకల ద్వారా ఆంత్రాక్స్, ఆవులు, గేదెలతో క్షయ, వాటి పాల ద్వారా బ్రూసెల్లోసిస్ వ్యాపిస్తుంది. పక్షుల వలన సిటాకోసిస్, ఎలుకలతో ప్లేగు, పిల్లుల వల్ల పాగ్స్ప్లాస్మోక్రాండై, కోళ్లు, పక్షుల ద్వారా బర్డ్‌ఫ్లూ, కుందేళ్ల ద్వారా టాక్సోప్లాస్మోసిస్, కోతుల ద్వారా లెప్రసీ సోకే ప్రమాదం ఉంది. బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్ వంటి సూక్ష్మజీవుల ద్వారా జూనోటిక్ వ్యాధులు మానవుల్లో, జంతువుల్లో వ్యాప్తి చెందుతాయి. వ్యాధి కారక పశువులు, పక్షులు, పెంపుడు జంతువుల నుంచి ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని ఇవి సంక్రమిస్తాయి. వీటి మల మూత్రాలు, కలుషిత ఆహారం తినడం, కీటకాలు వ్యాధి కారక జంతువులను కుట్టి ఆ తర్వాత మనుషులను కుట్టడం, వ్యాధి కారక జంతువులతో సన్నిహితంగా మెలగడం తదితర మార్గాల ద్వారా ఈ వ్యాధులు వ్యాప్తి చెందుతాయి.

అప్రమత్తత అవసరం

పశువులు, పెంపుడు జంతువులను తాకిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. వాటి పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలి. కీటక సంహారిణులు ఉపయోగించాలి. మార్కెట్ నుంచి తీసుకొచ్చిన కూరగాయలు, ఆకుకూరల్ని శుభ్రంగా కడగాలి. మాంసాన్ని బాగా ఉడికించి తినాలి. పచ్చి మాంసం జోలికి అసలే వెళ్లరాదు. పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి.

రేబిస్‌తో ప్రమాదం

రేబిస్ వ్యాధి సంక్రమించిన కుక్క కాటు వలన ఈ వ్యాధి మనుషులకు, జంతువులకు సోకుతుంది. కుక్క కరిచిన ఏడవ రోజు నుంచి నాలుగేళ్లలోపు ఎప్పుడైనా ఈ వ్యాధి లక్షణాలు బయట పడే అవకాశం ఉంది. జ్వరం, గొంతు నొప్పి, తలనొప్పి, గుటక వేయలేకపోవడం, నీటిని చూస్తూ భయపడటం, పిచ్చిగా ప్రవర్తించడం దీని ప్రధాన లక్షణాలు. కుక్క కాటుకు గురైన వ్యక్తి ఐదు డోసుల యాంటీ రేబిస్ టీకా తప్పనిసరిగా తీసుకోవాలి. కుక్క కరిస్తే వరుసగా 3, 7, 14, 28 రోజులకు ఒక్కో టీకా చొప్పున వేసుకుంటే వ్యాధి నుంచి బయట పడవచ్చు.

నేడు ఉచిత టీకా కార్యక్రమం

జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని కశింకోట, నరసింగబిల్లి, కన్నూరుపాలెం పశు వైద్య కేంద్రాలు, రైతు భరోసా కేంద్రాల్లో ఉచితంగా పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేయనున్నాం. ఈ అవకాశాన్ని పెంపుడు జంతువుల్ని సాకుతున్న యజమానులు వినియోగించుకోవాలి.

– ఆల్ఫోన్స్ జార్జి, మండల పశుసంవర్థక అధికారి, కశింకోట

కన్నూరుపాలెం హైస్కూల్లో అవగాహన

మండలంలోని కన్నూరుపాలెం హైస్కూల్లో స్థానిక పశు వైద్య కేంద్రం వైద్యాధికారి మర్తి దయానా విద్యార్థులకు జూనోటిక్ వ్యాధులపై అవగాహన కలిగించారు. జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే భయకరమైన వ్యాధులు రాకుండా ముందుగానే వాటికి టీకాలు వేయించాలన్నారు. కుక్కల ద్వారా అతి భయంకరమైన రేబిస్ వ్యాధి రాకుండా టీకాలు వేయించాలన్నారు. మండలంలోని మోసయ్యపేట శివారు గోకివానిపాలెం ప్రాథమిక పాఠశాలలో జూనోటిక్ వ్యాధుల పట్ల విద్యార్థులకు పశు వైద్య సహాయకుడు పి.ఈశ్వరరావు అవగాహన కల్పించారు. పెంపుడు కుక్కలకు టీకాలు వేయించాలని సూచించారు. అచ్చెర్ల రైతు భరోసా కేంద్రంలో కూడా స్థానికులకు అవగాహన కల్పించారు.



కన్నూరుపాలెం హైస్కూల్లో విద్యార్థులకు జూనోటిక్ వ్యాధులపై అవగాహన

టెన్త్ మెరిట్ విద్యార్థులకు సత్కారం రేపు

అనకాపల్లి: ఈ ఏడాది వెల్లడైన పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివి మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలతో ఆదివారం సత్కరించనున్నట్లు పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్, కార్యదర్శి సీహెచ్ పెద్దినాయుడులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయ రహదారి శ్రీ సత్యలక్ష్మీగ్రాండ్ హాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ విచ్చేయనున్నట్లు వెల్లడించారు.

రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా రాజేష్‌కుమార్



నూతన కమిటీతో గరుడ బుచ్చిరాజు

అనకాపల్లి: అనకాపల్లి రోటరీ క్లబ్ నూతన అధ్యక్షుడిగా సరిపల్లి రాజేష్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక న్యూకాలనీ రోటరీ కల్యాణమండపంలో శుక్రవారం జరిగిన ఎన్నికల్లో కార్యదర్శిగా దేవత అనిల్, కోశాధికారిగా గ్రంధి సత్యేంద్రతో పాటు మరో 31 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులతో క్లబ్ సీనియర్ నాయకుడు, విశాఖ ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ గరుడ బుచ్చిరాజు ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా బుచ్చిరాజు మాట్లాడుతూ క్లబ్‌లో కొత్తగా మరో పదిమంది సభ్యులను చేర్చుకున్నట్లు తెలిపారు. అంతా సమష్టిగా పనిచేసి, క్లబ్ తరఫున సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు కడిమిశెట్టి సతీష్, కె.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం పోస్టర్ ఆవిష్కరణ

పరవాడ: వాడచీపురుపల్లిలో ఈ నెల 7న మెగా ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్టు మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు తెలిపారు. గ్రామంలో ఏర్పాటు చేయనున్న మెగా ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. గ్రామంలో ఆదివారం నిర్వహించనున్న వైద్య శిబిరానికి నిపుణులైన వైద్యులు హాజరవుతారని తెలిపారు. రక్తదానం చేయడానికి ఆసక్తి కలిగిన యువత రావాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ శివలంక లక్ష్మి, ఉప సర్పంచ్ కేహెచ్‌వీ సత్యనారాయణ, వార్డు సభ్యులు చెల్లయ్యమ్మ, పి.లక్ష్మి, సత్యవతి, బి.లక్ష్మి, ముత్యాలు, పి.గోవింద్, ఎం.సురేష్ ,గౌతమ్, కె.రాజు, శ్రీను, వై.రాజు, నాని, ప్రసాద్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీపీ అప్పలనాయుడు తదితరులు

రసాయనాలతో కాలుష్యం కాటు

పరవాడ: నిబంధనలకు విరుద్ధంగా గెడ్డలు, చెరువుల్లోకి రసాయన వ్యర్థాలు విడుదల చేస్తున్న ఫార్మా యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. భర్నికం సమీపంలోని మొల్లోడి గెడ్డలో పేరుకుపోయిన వ్యర్థ రసాయనాలను శుక్రవారం పరిశీలించారు. రసాయనాలను శుద్ధి చేసి సముద్రానికి పంపాల్సిన ఫార్మా యాజమాన్యాలు చెరువులు, గెడ్డల్లోకి విడిచిపెట్టడడంతో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని ఆరోపించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఫార్మా యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లోకనాథం డిమాండ్ చేశారు. ఆయన వెంట సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఉన్నారు.



గెడ్డలోని రసాయన వ్యర్థాలను పరిశీలిస్తున్న సీఐటీయూ నాయకులు

తహసీల్దార్ చలమయ్య మృతి

సబ్బవరం: సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో భాగంగా సబ్బవరం తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన జె. చలమయ్య అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందారు. వివరాలు.. తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన కొద్ది రోజులకే అనారోగ్యం బారిన పడడంతో రెండు నెలలు సెలవు పెట్టారు. ఈ నేపథ్యంలో పరిస్థితి విషమించడంతో విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు డిప్యూటీ తహసీల్దార్ వెంకట్ తెలిపారు. ఆయన స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా పాతపట్నం కాగా ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. భార్య ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుండగా కుమార్తె మెడిసిన్, కుమారుడు ఇంటర్మీడియట్ చదువుతున్నారు.

నాయకుల సంతాపం

తహసీల్దార్ చలమయ్య మృతికి సంతాపంగా వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం సంతాపం తెలిపారు.అతని ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. సంతాపం తెలియజేసినవారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు బోకం రామునాయుడు,గండి రవికుమార్,కొటాన రాము,సబ్బవరం సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు,సబ్బవరపు నారాయణమూర్తి,పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు,వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు,ఐడీ బాబు,బైలపూడి రామారావు,బోను గంగునాయుడు,పిల్లల అప్పలనాయుడు,మామిడి కొండాజీ,కర్రి అప్పారావు, సబ్బవరపు నాగభూషణం తదితరులు ఉన్నారు.





సంతాపం తెలియజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు (ఇన్‌సెట్) చలమయ్య (ఫైల్)

ఖరీఫ్ నాట్లకు నారుమడులు సిద్ధం

ఎస్.రాయవరం : ఖరీఫ్ నాట్లకు అన్నదాతలు పొలాల్లో నారుమడులు సిద్ధం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. పంటలకు ప్రధానంగా జీవనాధారం అయిన వరాహ నదిలో నీటి ప్రారంభం అయ్యేసరికి అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలు వరికి అనుకూలమని వరి నారులు వేస్తున్నారు. కొరుప్రోలు, పెదఉప్పలం, తిమ్మాపురం, పెద గుమ్మలూరు తదితర గ్రామాల్లో జోరుగా వరినాట్లు వేస్తున్నారు. దీనికి తోడు వరాహనది నదిలో గ్రోయిన్లకు తాత్కాలిక మరమ్మతులు పూర్తి చేశారు. ఈ మేరకు నదిలో నీరు అన్ని పాయలకు సక్రమంగా పారుతోంది. దీంతో నారుమడులు సిద్ధం చేసుకుంటే, నాట్లు వేయవచ్చన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు అధికారులు రైతులకు అవసరమయిన విత్తనాలు ఆయా గ్రామాల్లో ఆర్బీకేల ద్వారా సరఫరా చేశారు.



కొరుప్రోలులో నారుమడులు దున్నుతున్న దృశ్యం

ప్రమాద బాధితునికి గోల్డ్ వాసు వితరణ



ఫరీద్ కుటుంబ సభ్యులకు బియ్యం, సరకులు, నగదు అందిస్తున్న మళ్ల సురేంద్ర, గోల్డ్ వాసు

తుమ్మపాల: ఇటీవల ప్రమాదానికి గురై ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న డ్యాన్స్ ఈవెంట్స్ నిర్వాహకుడు ఫరీద్ కుటుంబానికి మూడు నెలలకు సరిపాడా రేషన్, పిల్లల చదువుకు స్థానిక సంఘ సేవకుడు గోల్డ్ వాసు ఆర్థిక సాయం అందించినట్లు నాగార్జున ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మళ్ల సురేంద్ర తెలిపారు. ఈ మేరకు ఫరీద్ నివాసం వద్ద శుక్రవారం కుటుంబ సభ్యులకు సరకులు, నగదు అందించారు. నిరుపేదలకు తన వంతు సాయపడుతున్న గోల్డ్ వాసును సురేంద్ర అభినందించారు. కార్యక్రమంలో పొలమరశెట్టి చందు, భాను పాల్గొన్నారు.

పాఠశాలల్లో హోంమంత్రి ఆకస్మిక తనిఖీ



ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న హోం మంత్రి అనిత

పాయకరావుపేట : గంజాయి రహిత రాష్ట్రంగా ఆంధ్రాను చూడబోతున్నామని, గంజాయిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఆమె పట్టణంలో పాఠశాలలను శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీ బాలికల హైస్కూల్‌లను సందర్శించి మధ్యాహ్న భోజనం పథకం అమలుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా పరిష్కరించడానికి చర్యలు చేపడతామన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, తహసీల్దార్ జె.సూర్యనారాయణ, ఎంపీడీవో స్వప్న, ఎంఈవోలు కె.ఎన్.గాంధీ, కె.రమేష్‌బాబు పాల్గొన్నారు.

నేటి నుంచి వారాహి నవరాత్రి ఉత్సవాలు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి పీఠంలో శనివారం నుంచి ఈ నెల 14వ తేదీ వరకూ వారాహి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసినట్లు గురుమాత అన్నపూర్ణమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవరాత్రుల్లో భాగంగా ప్రతిరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించనున్నారు. శనివారం కలశ స్థాపన,గోమాత పూజలతో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. 14న వారాహి యంత్ర సిరిజ్యోతి పూజ,సామూహిక వారాహి సహస్ర నామార్చన పూజలు చేయనున్నట్టు గురుమాత పేర్కొన్నారు. భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.



దేవీపురంలోని రాజరాజేశ్వరీదేవి

ధ్యానంతో మానసిక ప్రశాంతత

అనకాపల్లి: నిత్యం ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందని ధ్యాన ఆశ్రమం శ్రీ గీజా పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ వ్యవస్థాపక ప్రతినిధి నరేంద్ర ముదల్కర్ అన్నారు. స్థానిక గవరపాలెం గౌరీ పంచాయతన దేవస్థానం ఆధ్వర్యంలో శుక్రవారం ధ్యానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒత్తిడితో మనుషుల జీవనశైలిలో మార్పులు చోటుచేసుకున్నాయన్నారు. కోవిడ్ తరువాత ప్రతి వ్యక్తి వ్యాయామం, ధ్యానం, యోగాపై ఆసక్తి పెంచుకున్నట్లు పేర్కొన్నారు. ఒత్తిడితో శరీరం పలు వ్యాధుల బారిన పడే అవకాశాలున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



ధ్యానంపై అవగాహన కలిగిస్తున్న నరేంద్ర ముదల్కర్

గురుకుల పాఠశాలల్లో మిగులు సీట్ల భర్తీ

సబ్బవరం: ఉమ్మడి విశాఖ జిల్లా గురుకుల పాఠశాలల్లోని 2024–25 సంవత్సరానికి గాను మిగులు సీట్లు భర్తీకి సబ్బవరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో శుక్రవారం ప్రవేశాలు కల్పించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని 11 గురుకులాల్లోని బాలబాలికలకు 5వ తరగతిలో మిగులు సీట్లు భర్తీకి లాటరీ పద్ధతిలో ప్రవేశాలు కల్పించారు. ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త ఎస్. రూపావతి అధ్యక్షతన కౌన్సెలింగ్ నిర్వహించారు. సుమారు 100 మంది విద్యార్థులు ప్రవేశాల కోసం హాజరయ్యారు. కార్యక్రమంలో సబ్బవరం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్. రామకృష్ణతో పాటు మిగిలిన గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు, సిబ్బంది హాజరయ్యారు.



విద్యార్థికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న జిల్లా సమన్వయకర్త రూపావతి తదితరులు

700 యాంటీ రేబిస్ టీకాలు సిద్ధం

పరవాడ: ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జూలై 6న పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో కుక్కలకు ఉచితంగా యాంటీ రేబీస్ టీకాలు వేయడానికి సన్నాహాలు చేస్తున్నామని పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ రామకృష్ణకీర్తి చెప్పారు. స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పరవాడ, లంకెలపాలెం, వాడచీపురుపల్లి పశువైద్య శాలల్లో ఉచితంగా టీకాలు వేయడానికి ఏర్పాట్లు చేశామని చెప్పారు. మండల వ్యాప్తంగా 700 యాంటీ రేబీస్ టీకాలు సిద్ధం చేసినట్టు తెలిపారు. ప్రముఖ శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ కుక్క కాటు బారిన పడిన ఒక పిల్లాడికి టీకా మందు ఇచ్చి బతికించిన రోజు కావడం వల్ల జూలై 6న జూనోసిస్ దినోత్సవంగా నిర్వహిస్తున్నామన్నారు. పశుపక్ష్యాదు ల నుంచి సుమారు 180 రకాల వ్యాధులు మనుషుల కు సంక్రమిస్తాయన్నారు. జూనోటిక్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేయడమే ప్రపంచ జూనోసిస్ దినోత్సవ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. పశు వైద్యులు, రైతులు, పెంపుడు జంతువులతో సన్నిహితంగా ఉండే వారికి ఎక్కువగా ఈ వ్యాధులు సక్రమిస్తాయన్నారు. పశువుల పెంపకందారులు, ప్రజలు, రైతులు జూనోటిక్ వ్యాధులపై అవగాహన పెంచుకుని ఆరోగ్యాలను కాపాడుకోవాలని కోరారు. సమావేశంలో వాడచీపురుపల్లి పశువైద్యాధికారి పి.సురేష్ కుమార్, లంకెలపాలెం పశువైద్యాధికారి అశ్విని ప్రపుల్లా, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ ఏడీ రామకృష్ణకీర్తి